# నెత్తురుమాడు

రావినూతల సువర్ణాకన్నన్

రోహిణీకార్తె ఎండ మండిపోతోంది. వడగాల్పులు నిప్పులు చెరుగుతున్నట్టు విసిరి విసిరి కొడుతున్నాయి. మిట్టమధ్యాహ్నం కావడాన సూర్యుడు మరీ మండి పడు తున్నాడు.

ఆ టైమ్‌లో డి.ఎమ్.ఓ. ఆఫీసు వెల్ల నీడలో ఓ నడి వయస్కురాలు బుజాలనిండుగా కొంగు కప్పుకుని ఆశగా, ఆత్రతగా చూస్తోంది ఆఫీసులోని ఓ గదివైపు. అలా ఎంతో సేపట్నించి అక్కడుండి ఎవరికోసమో చూస్తోం దని వాడిపోయిన ఆమె మొహం చూస్తేనే తెలిసి పోతుంది.

మరో గంట గడిచాక ఆఫీసు ఎస్టాబ్లిష్‌మెంటు క్లర్కు కోటయ్యచుట్టూ చేరి మంతనాలాడిన నలుగురైదుగురు వ్యక్తులు నవ్వు ముఖాలతో బైటికొచ్చారు.

అంతవరకూ క్షణం ఒక యుగంలా గడిపిన స్త్రీ వాళ్ళలా వెళ్ళగానే గబగబా ఆఫీసు మెట్లెక్కి కోటయ్య రూమ్ దగ్గర నిల్చుంది దీనంగా.

ఏవో ఆనందలోకాల్లో తేలుతున్నట్టు కుర్చీలో చేరగిలబడి సిగరెట్ ఊదేస్తున్న కోటయ్యకి ఆవిడ రాక తెలియనేలేదు.

పది నిమిషాలు అలాగే నిల్చున్న ఆమె ఇంక అతను తనని గమనించడన్న నిరాశతో—

"నమస్కారం అన్నయ్యగారూ!" అంది మెల్లగా.

సుందరస్వప్నం చెదిరినట్టు ఉలిక్కిపడి తిరిగి చూశాడు కోటయ్య. ఆ సమయంలో ఆమెని చూడగానే అతనికి స్వర్గంలోంచి ఒక్కసారి నరకంలోకి జారినట్టయింది. మొహంలో చిరాకు స్పష్టంగా కనిపిస్తోంది. తన చిరాకుని చిరునవ్వు వెనక అతి ప్రయత్నంమీద దాచేసి—

"అయ్యో!... ఇవాళ మిమ్మల్ని రమ్మన్నానుకదూ! సారీ అమ్మా!... డి.ఎమ్.ఓ.గారు ఊళ్ళో లేరు!" సాధ్యమైనంత మృదుత్వాన్ని గొంతులో నింపుకొని అన్నాడు కోటయ్య.

ఆశగా చూస్తున్న ఆమె కళ్ళు నిరాశగా వాలిపోయాయి. ఎండకి వాడిన మొహం మరింత వాడిపోయింది.

"మళ్ళీ... ఎప్పుడు రానన్నయ్యగారూ?" అంది నీర్సంగా.

"ఎప్పుడంటే...ఆ!... ఎల్లుండి రండి! డి.ఎమ్.ఓ.గారు రేపు సాయంత్రం వచ్చేస్తారు!" అన్నాడు కోటయ్య క్షణం ఆలోచించి.

"ఎల్లుండైనా అయ్యేలా చూడండన్నయ్యగారూ, నాకెవ్వరూ లేరని మీకు తెలుసుగా... పసివాళ్ళని పక్కింట్లో ఒదిలొచ్చాను!" ఆమె గొంతు ఒణికింది.

"తప్పకుండా చూస్తానమ్మా! నాకు మాత్రం మిమ్మల్ని ఇలా తిప్పించడం ఇష్టమా?" నొచ్చుకున్నట్టు అన్నాడు కోటయ్య.

ఆమె అతనికి మరోసారి నమస్కరించి ఉసూరుమంటూ వెళ్ళిపోయింది.

* * *

పార్వతి డిస్‌పేచ్ క్లర్కు రంగనాథం భార్య. భర్త తెచ్చేదాంతో, ఇద్దరు బిడ్డలతో ఇల్లే స్వర్గంగా తీర్చిదిద్దగల ఇల్లాలు. ఇల్లు, భర్త, పిల్లలు తప్ప బైట ప్రపంచం అంతగా తెలియని అమాయకురాలు! తనని గురించి ఎదురుగా కామెంట్ చేసినా... తన కెందుకులే అన్నట్టు పక్కకి తొలగిపోయేంతటి భయస్తురాలు!

భార్యలాగే రంగనాథం కూడా కల్లకపటం తెలియని అమాయకుడు. పరోపకారం అతని నరనరాల్లోనూ జీర్ణించుకు పోవడంవల్ల అడిగినా, అడక్కపోయినా ఎవరికైనా అవసరం వస్తే వెళ్ళి సాయపడేవాడు తనకి చాతనైనంతలో.

ఓసారి కోటయ్య భార్యకి ఏదో పెద్ద సుస్తీ చేసి ప్రాణంమీదికొచ్చింది. సమయానికి కోటయ్య ఊళ్ళో లేడు. విషయం తెలిసిన రంగనాథం క్షణాలమీద వెళ్ళి అక్కడ వాలాడు.

అంతవరకు సానుభూతి వాక్యాలతో కాలం గడుపుతున్న అమ్మలక్కలు అతను రాగానే పక్కకి తప్పుకున్నారు. తమనెక్కడ సహాయం అడుగుతాడో అన్న భయంతో.

రంగనాథం ఆమెని కొందరి సలహామీద ఓ నర్సింగ్ హోమ్‌లో చేర్చాడు. యమర్జన్సీ ఆపరేషన్ జరిగింది. మందులు అవీ అవసరం అయితే తనే కొని తెచ్చాడు.

టెలిగ్రాం అందుకుని కోటయ్య వచ్చేసరికి భార్య యమలోకపు ముఖద్వారంలోంచి ఇవతలికొచ్చేసింది.

జరిగింది తెలుసుకున్న కోటయ్య రంగనాథాన్ని పట్టుకుని బావురుమన్నాడు ఆడదానికన్న ఎక్కువగా. నీ ఋణం ఈ జన్మలోనే కాదు ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను! అంటూ కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు. నీ డబ్బు జీతంరాగానే పువ్వుల్లో పెట్టి మరీ ఇస్తానని వాగ్దానం చేశాడు.

అన్నింటికీ రంగనాథం చల్లగా నవ్వేశాడు. "ఇందులో నేను చేసిందేంలేదు కోటయ్యా! రేపు నాకూ ఇలాంటి అవసరమే రావచ్చు! మీరు చూస్తూవూరుకుంటారా?... ఇది కేవలం మానవత్వం అన్నాడు తేలిగ్గా.

అప్పట్నించి కోటయ్య తరచు రంగనాథమింటికి వస్తూండేవాడు. అతను చేసిన సహాయం గుర్తుచేసి కృతజ్ఞతలు చెప్పుకునేవాడు.

పార్వతికూడా అతనంటే కాస్త చనువు ఏర్పడింది. 'అన్నయ్యగారూ!' అంటూ మంచీ, చెడు అతనితో మాట్లాడుతూండేది.

అలాంటి సమయంలో రంగనాథం హటాత్తుగా హార్టెటాక్‌తో కన్నుమూసి భార్యాబిడ్డల బ్రతుకుల్ని అంధకారంలోకి తోసేశాడు.

పార్వతికి ఉద్యోగం చేసి తనని తాను పోషించుకోగల చదువుసంధ్యల్లేవు! నీకు నేనున్నానని నీడనిచ్చే దగ్గర బంధువులూ లేరు!

ఆఫీసంతా వచ్చి నాలుగు సానుభూతి వాక్యాలు పలికి " ఆ ఇద్దరి పిల్లల్నీ చూసుకుని కాలం వెళ్ళదియ్యండి" అని సలహా ఇచ్చి వెళ్ళిపోయారు. అయితే... అలా పిల్లల్ని చూసుకుంటూ కాలం వెళ్ళబుచ్చాలన్నా... ఆ మూడు పొట్టలకీ ఇంత తిండి పడెయ్యాలనీ, ఆ తిండి పడెయ్యకపోతే... ఆ ప్రాణాలు కూడా నిలవ్వనీ ఆ ప్రాణాలు నిలిపే శక్తిగానీ, యుక్తిగానీ ఆ ఇల్లాలికి లేవని వాళ్ళకి తెలిసినా ఆ విషయాల్ని గురించి ఆలోచించి బుర్రలు పాడుచేసుకోవాల్సిన అవసరం మాత్రం వాళ్ళకి లేదు. అందుకే రంగనాథాన్ని పిడికెడు బూడిద చేయించి చేతులు కడుక్కుని ఎవరిదార్న వాళ్ళు వెళ్ళిపోయారు.

పార్వతి ఇద్దరు పసివాళ్ళతో ఒంటరిగా నిల్చిపోయింది.

ఓ రోజు భర్త పెట్టె తీసి చూస్తుంటే ఇన్సూరెన్స్‌కి సంబంధించిన కాయితాలు కనిపించాయి.

అప్పుడు గుర్తొచ్చిందామెకి. మూడేళ్ళ క్రితం భర్త ఇరవై వేలకి ఇన్‌స్యూరెన్స్ చెయ్యడం. వెంటనే పక్కింట్లో వున్న ఎల్.ఐ.సి. ఆఫీసర్‌గారి దగ్గరకెళ్ళి కాయితాలు చూపించింది. ఆ కాయితాల్ని చూసి నేను ఆఫీసులో కనుక్కుని చెప్తాను రేపు రండి, అని చెప్పాడాయన.

ఆయన రమ్మన్నట్టే మర్నాడు సాయంత్రం ఆయన దగ్గరకెళ్ళింది పార్వతి.

రెండు వాయిదాలు కట్టనందున పాలసీ లాప్స్ అయిపోయిందనీ, అయినా కూడా కొత్త రూల్స్ ప్రకారం డబ్బు రావడానికి అవకాశం వుందనీ. గడిచిన మూడేళ్ళ సిక్‌లీవ్ పర్టిక్యులర్స్, డెత్ సర్టిఫికెట్టు తెచ్చుకున్నట్టయితే ఆ డబ్బు వచ్చేలా తను చూస్తానని ప్రామిస్ చేశాడాయన.

సిక్‌లీవ్ పర్టిక్యులర్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్కు కోటయ్య సీట్నుంచే కదలాలని తెలుసుకున్న ఆమె తేలిగ్గా

నిట్టూర్చింది. మర్నాడే అతని ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళింది పార్వతి. అయితే అతను ఇంట్లో లేడు. అతని భార్య వున్నా ఆమెకి తన ప్రాణాలు కాపాడిన రంగనాథం గుర్తురాలేదు! కానీ కొత్తగా విధవైన రంగనాథం భార్య మొహాన్ని తిధి, వార నక్షత్రాలని చూడకుండా చూడాల్సొచ్చినందుకు పిచ్చ కోపం మాత్రం వచ్చింది. అందుకే తెగ చిరాకు పడిపోతూ—

"ఇలాంటివన్నీ ఆఫీసుల్లో చూసుకోవాలమ్మా! ఇళ్ళకి రానక్కర్లేదు!" అంది నిర్మొహమాటంగా.

నిర్ఘాంతపోయింది పార్వతి.

అవమానంతో ఇంటికొచ్చి కసువుతీరా ఏడ్చింది. అభిమానం దెబ్బతిన్నందుకు కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

కానీ అభిమానం కూడు పెట్టదు.

అందుకే మర్నాడు అభిమానాన్ని ఆమడ దూరం నెట్టేసి ఆఫీసుకెళ్ళి కోటయ్యని కలుసుకుంది. అతను విషయమంతా విని—

"ఇదెంత భాగ్యవమ్మా! రేపు రండి అన్నీ సిద్ధం చేసి వుంచుతాను" అన్నాడు.

అయితే అలాంటి రేపూలు చాలానే అయ్యాయి. కానీ... కాయితాలు మాత్రం పార్వతి చేతికి రాలేదు.

డి.ఎస్.ఓ.గారి సంతకం కాలేదనీ, డి.ఎస్.పి.ఓ. గారు కేంపులో ఉన్నారనీ, అర్జంటు పన్లు హటాత్తుగా వచ్చి పడ్డాయనీ వాయిదాలు వేస్తున్నాడు కోటయ్య.

పార్వతి అమాయకంగా ఆఫీసు చుట్టూ తిరుగుతూనే వుంది.

రోజూ పొద్దున్నే రావడం, మూడింటిదాకా వుండడం, ఆపై నిరాశగా వెళ్ళిపోడం ఆమె దినచర్యగా మారింది.

ఇలా వాయిదాలు వేస్తే... తనకివ్వాల్సిన లంచం గురించి అర్థం చేసుకుంటుందని ఆశపడ్డ కోటయ్య ఆమెకాధోరణి లేకపోవడంతో తెగ చిరాకు పడిపోతున్నాడు. చివరికిలా కాదని ప్యూన్ ఖాదర్‌ని పిల్చి డబ్బు విషయం ఆవిడకాస్త హింట్ ఇమ్మన్నాడు, తను చెప్పలేక.

ఖాదర్ చెప్పాడు.

ఆమె నిర్ఘాంతపోయింది!

"ఖాదర్, నా సంగతి నీకు తెలుసుగా... అయ్యగారు నాకా ఇద్దరు పిల్లల్ని తప్ప ఏం మిగల్చలేదు!" గద్గద స్వరంతో అంది.

ఖాదర్‌కి ఆమెని చూస్తే జాలేసింది. అయినా కోటయ్య ఎంత డబ్బుమనిషో, డబ్బుకోసం అతను ఎన్నిరకాల గడ్డి తింటాడో అతనికి బాగా తెలుసు... అందుకే—

"తప్పదమ్మా! మీ పని కావాలంటే తల తాకట్టు పెట్టయినా అతని ముడుపు చెల్లించాల్సిందే" అన్నాడు జాలిగా.

పార్వతి కృంగిపోయింది.

మర్నాడు మామూలుగానే వచ్చింది.

కోటయ్య బిజీగా వున్నాడు.

పన్లవత్తిడి వల్ల కాదు, లంచాల బేరసారాలతో.

పార్వతి అటుగా వెళ్తున్న ఖాదర్‌ని పిల్చి, అతను రాగానే—



"ఖాదర్! ఒక్కసాయం చేసిపెడతావా?" అంది దీనంగా.

"చెప్పండమ్మా!"

"ఇదిగో! ఇవి... కాస్త అమ్మిపెట్టవూ?" అతని చేతిలో ఓ చిన్న పొట్లాం పెట్టింది పార్వతి.

అతను ఆశ్చర్యంగా పొట్లం విప్పాడు.

అవి రెండు మంగళ సూత్రాలు!

ఖాదర్ మనసు భారంగా అయిపోయింది.

"ఇవి... ఇనమ్ముతారామ్మా?" అన్నాడు జాలిగా చూస్తూ.

"తప్పదు ఖాదర్! అయినా ఆయన పోయాక ఇంక వీటితో నాకు పనేం వుంది? ...ప్లీజ్! నాకెవరూ తెలియదు. ఇది అమ్మేసి ఎంతొస్తే అంత కోటయ్యగారి కిచ్చెయ్" అంది పార్వతి ఒణుకుతున్న గొంతుతో.

ఆమె కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఖాదర్ మనసు ద్రవించిపోయింది.

"అలాగేనమ్మా!" అంటూ వాటిని తీసుకుని వెళ్ళి పోయాడు.

నెల్లాళ్ళుగా ప్రతిరోజూ ఓ స్త్రీ ఉదయం రావడం, సాయంత్రం ఉసూరుమంటూ వెళ్ళడం మరో బ్లాక్ నుంచి డి.ఎఫ్.సి.ఓ. రావు చూస్తూనే వున్నాడు. అయినా మొదట్లో అంతగా పట్టించుకోలేదు. కానీ ఆమె ఎండలో రావడం, బెరుగ్గా, నిండా కొంగు కప్పుకుని ఆశగా ఆఫీసుకేసి చూడ్డం, మళ్ళీ నిరాశగా వెళ్ళిపోవడం, రొటీన్‌గా జరుగుతుంటే అతని కుతూహలం పెరిగింది.

ఆ రోజు ప్యూన్ చేతికి ఏదో ఇవ్వడం కూడా అతని కంట పడింది. దాని సంగతి తేల్చాలన్న వుద్దేశంతో ఖాదర్ని పిల్చాడు. అతను రాగానే—

"ఆవిడెవరు?" ఎలాంటి వుపోద్ఘాతం లేకుండానే అడిగాడు.

"ఎవరయ్యా?"

"అదే... నువ్విప్పుడుమాట్లాడావే! ఆమె...

"ఆవిడా? మన డిస్పేచ్ క్లర్క్ రంగనాథం గారి భార్యయ్యా!"

"అంటే... ఆ మధ్య... హార్టెటాక్‌తో..."

"అవునయ్యా! ఆయన భార్యే!"

"మన ఆఫీసుకెందుకొస్తోంది?"

క్షణం తటపటాయించి క్లుప్తంగా చెప్పాడు ఖాదర్.

"మరి ఆ కాయితాల్ని ఎందుకు పుటప్ చెయ్యలేదు?" కళ్ళు చిట్లించి అన్నాడు రావు.

"తమకి తెలియందేవుందయ్యా!" నసిగాడు ఖాదర్-

"ఏమిటి నాకు తెలిసింది?"

"కోటయ్యగారు ఆ కాయితాల్ని తొక్కిపెట్టారయ్యా!" అన్నాడు ఖాదర్.

"ఎందుకు?"

విషయమంతా వివులంగా చెప్పాడు. అంతేకాదు, రంగనాథం కోటయ్యకి ఎంత సహాయం చేశాడో, వాళ్ళిద్దరూ ఎంత స్నేహంగా వుండేవారో అన్నీ చెప్పేశాడు ఖాదర్. అతనిక్కూడా... కోటయ్య చేసే పని



నచ్చలేదు.

రావు మనసు భగ్గుమంది.

మెల్లగా ఏదో చెప్పి ఖాదర్ చేతిలోని పొట్లాం తీసుకుని పంపేశాడు.

* * *

"నమస్కారమయ్యా!" నసుగుతూ వచ్చాడు ఖాదర్.

"ఏమిటి! ఆవిడకి డబ్బు విషయం చెప్పావా?" ఉత్సాహంగా అన్నాడు కోటయ్య.

"చెప్పానయ్యా! ...కానీ ఆవిడదగ్గర డబ్బేం లేదట" చల్లగా చెప్పాడు ఖాదర్.

కోటయ్య మొహం వికృతంగా అయిపోయింది.

"అయితే మన దగ్గర కాయితాలు కూడా కదలవ్!" అన్నాడు కోపంగా.

"ఇప్పుడేం చేద్దామయ్యా?" అమాయకంగా అన్నాడు ఖాదర్.

"చేసేదేంవుంది ఖాదర్! ఆ కాయితాలు తొక్కిపెట్టెయ్యడమే! అయినా... అయిదొందలు కట్టి ఇరవై వేలు తీసుకుందామన్న ఆశే తప్ప... మన కష్టాన్ని కూడా దృష్టిలో వుంచుకుని నాలుగు రాళ్ళు పడెయ్యాలన్న జ్ఞానం లేదుకదా! అదోలా నిట్టూర్చాడు కోటయ్య.

అప్పుడే పార్వతి వచ్చింది.

"ఏమిటమ్మా?" ముఖం గంటు పెట్టుకున్నట్టు అన్నాడు.

"అదే ఆ కాయితాలూ..."

"నన్నేం చెయ్యమంటావమ్మా! అంతా నా చేతుల్లోనే వుందా? రోజూ వచ్చి పీకలమీద కూర్చోవడమే గానీ మా బాధ ఏనాడైనా అర్థం చేసుకున్నారా?"

అతని ధోరణికి నిర్ఘాంతపోయింది పార్వతి.

"అదికాదన్నయ్యగారూ..."

"ఇంకేం మాట్లాడద్దమ్మా! ఇంక నువ్వు రోజూ వచ్చి నా ప్రాణం తియ్యక్కర్లేదు... పని కాగానే ఆ కాయితాల్ని నేనే తెచ్చి మీ ఇంట్లో ఇస్తాను! సరా?" కాస్త విసుగ్గా, కాస్త అనునయంగానూ అన్నాడు కోటయ్య.

"అయ్యగారొస్తున్నారు" హటాత్తుగా అన్నాడు ఖాదర్.

గతుక్కుమన్నట్టు గభాల్న లేచాడు కోటయ్య. ఎందుకో అతని మొహమంతా చిరుచెమటలు పట్టాయి. పార్వతి ఓ పక్కగా తప్పుకుంది.

"కోటయ్య గారూ!" ఖంగుమంది రావు గొంతు.

"ఎస్సర్!" వినయంగా అన్నాడు కోటయ్య.

"ఈవిడెవరు? రోజూ మనాఫీసుకి వస్తున్నారను కుంటాను" అమాయకంగా అన్నాడు రావు.

"అవును సర్!"

"ఎందుకొస్తున్నారు?"

చెప్పాడు కోటయ్య.

"మరి ఆవిడ పని పూర్తిచేసి పంపెయ్యకూడదూ?"

"ఆ ప్రయత్నంమీదే వున్నాను సర్!" తడబడుతూ అన్నాడు కోటయ్య.

"ఎన్నాళ్ళా ప్రయత్నం?"

"ఇదిగో.... ఇంక..."

"మీక్కావల్సింది ముట్టేదాకా? అంతేనా?

"ఛ! ఛ! అదేంకాదు సర్! పని వత్తిడి వల్ల..."

"ఈవిడ భర్త మీతోపాటు పనిచేసేవాడు కదూ?"

"అవును సర్!"

"మీకు ఫ్రెండ్ కూడానేమో!"

"అవును సర్!..."

"ఈవిడ భర్త బతికుండగా ఎప్పుడైనా మన ఆఫీసు కొచ్చారా?"

"లేదు సర్!"

"కానీ... ఇప్పుడొచ్చారు! కాదు! నెల్లాళ్ళుగా వస్తున్నారు! అయినా ఆవిడ పని కాలేదు!"

"అదే సర్! పనివత్తిడి వల్ల..."

"షటప్! పని వత్తిడి కాదు! డబ్బు వత్తిడి! ఆమెని డబ్బుకోసం పీడిస్తున్నావ్! ఆమె ఇచ్చుకోలేని దయనీయ పరిస్థితిలో వుంది! భర్త స్నేహితుడివన్న ఆశతో ఇన్నాళ్ళుగా నీ చుట్టూ తిరుగుతోంది. చివరకి డబ్బు లేందే పనికాదని నిర్ణయించుకుని మరో గత్యంతరం లేక తను తీసేసిన మంగళ సూత్రాలు అమ్మి నీకివ్వాలను కుంది" కఠినంగా అన్నాడు రావు.

అయోమయంగా చూశాడు కోటయ్య.

"ఇదిగో! కోటయ్యా! ఈ భూమ్మీద ఎవరూ శాశ్వతం కాదయ్యా! అందరం ఎప్పుడో ఒకప్పుడు పోవల్సిందే! అదీ ఎలా పోతామో మనకి తెలియదు!

రేపు... మనకీ ఇదే పరిస్థితి రాదన్న గ్యారంటీ లేదు! ...అప్పుడు నీ భార్యా, నా భార్యా కూడా ఈమెలాగే ఎండలో, చెట్లకిందా, గంటలుకొద్దీ వెయిట్ చేస్తూ, నెలలతరబడి మనాఫీసు చుట్టూ తిరగాల్సి రావచ్చు!

అది వూహించకపోయినా మన మధ్య పనిచేసిన ఓ వ్యక్తి హటాత్తుగా పోయి, అతని భార్య దయనీయ పరిస్థితుల్లో నీ దగ్గరకొస్తే... ఇంత దారుణంగా ప్రవర్తిస్తావా?... ఇలాంటి నెత్తురుకూడు తింటే... మన భార్యా బిడ్డలు చల్లగా వుంటారా?" ఆవేశంతో రావు కళ్ళు

ఎర్రబడ్డాయి.

భయంతో కొయ్యబారిపోయాడు కోటయ్య.

"అబ్బే! అలా అన్లేదు సర్!" అంటూ ఏదో చెప్ప బోయాడు.

"షటప్! ఇంకా బుకాయించాలని చూస్తున్నావా? ...ఖాదర్! ఆ టేప్ రికార్డర్ ఇలా పట్రా!" అన్నాడు రావు నిప్పులు కురిపిస్తున్నట్టు. ఖాదర్ సైడ స్టూల్ మీదున్న టేప్ రికార్డర్ తెచ్చాడు.

తన డైలాగ్సన్నీ స్వయంగా విన్న కోటయ్య కొయ్య బారిపోయాడు. అతను తేరుకోకముందే—

"ఇదిగో! కోటయ్యా! నీకో గంట టైమిస్తున్నాను. ఆ గంటలోగా ఆ కాయితాలు ఆవిడ చేతుల్లో వుండాలి. లేకపోతే ఏం జరుగుతుందో నేను చెప్పక్కర్లేదు!" అని పార్వతికేసి తిరిగి—

"అమ్మా! మీరు నాకు తెలియదు. ఖాదర్ ద్వారా మీ సంగతంతా తెలుసుకున్నాను! ఇన్నాళ్ళూ తెలుసు కోనందుకు సిగ్గుపడుతున్నాను!

మరో గంటలో మీక్కావల్సిన పేపర్స్ మీ చేతి కొస్తాయి! ఇంద! ...ఇవి ...జాగ్రత్త పెట్టుకోండి!" అంటూ సూత్రాలున్న పళ్లాన్ని నిర్ఘాంతపోయి చూస్తున్న పార్వతి చేతిలో పెట్టాడు రావు.

మనుషుల్లో కూడా ఇలాంటి దేవుళ్ళుంటారా అన్నట్టు... నిర్ఘాంతపోయి చూస్తున్న పార్వతి అప్రయత్నంగా అతని పాదాల్నంటి నమస్కరించింది.

"ఛ! ఛ! ఇదేం పనమ్మా!" కంగారుగా వెనక్కి జరిగాడు రావు.

"మీరు దేవుడు సర్!" గద్గద స్వరంతో మనస్ఫూర్తిగా అంది పార్వతి.

అతను అదోలా నవ్వాడు.

"మనుషులు ఎప్పటికీ దేవుళ్ళు కాలేరమ్మా! మానవులు మానవులే! కాకపోతే... దానవులుగా మారకూడదు! మీరెళ్ళండి! వెళ్లి అక్కడ హాల్లో కూర్చోండి!" అంటూ వెనుతిరిగాడు రావు.

ఆమె రెండు చేతులూ జోడించింది.

"మరో సంగతి!" రావు వెనుతిరిగాడు.

"ఏమిటి సర్!" అన్నట్టు చూసింది పార్వతి.

"ముందు ముందు మీకేపని కావాలనుకుంటే సరాసరి వెళ్ళి ఆఫీసర్స్‌ని కలవండి! మీ పని కాస్త త్వరగా జరగడానికి అవకాశం వుంటుంది!" అని హుందాగా నడిచిపోతున్న రావు పార్వతి కళ్ళకి సాక్షాత్తూ అతని రూపంలో వచ్చిన ఆ శ్రీరామచంద్రుడిలాగే కనిపించాడు.

గంటలో ఆ కాయితాలు ఆవిడకి ఇవ్వకపోతే తన బ్రతుకు ఏమై పోతుందో బాగా తెలిసిన కోటయ్య ఆ కాయితాల్ని అరగంటలోనే పార్వతి చేతికందించడానికి కావలసిన సన్నాహాలు ప్రారంభించాడు.

"నిజంగా ఆఫీసరుగారు దేవుడే!" మరోసారి అనుకుంది పార్వతి హాల్లోకెళ్ళి కూర్చుంటూ.

అయితే ఈవిడకి రావల్సిన ఫేమిలీ పెన్షన్, గ్రాట్యుటీ రావడానికి ఏ దేవుళ్ళాడుకోవాలో!

# * సిరి సిరి మువ్వలు *

ఖద్దరు టోపీ పాలన
రద్దైపోయింది ఆంధ్ర రాష్ట్రంలోనన్
గద్దెక్కెను కాషాయం
సిద్దమురా రద్దులెన్నొ సిరిసిరిమువ్వా

లంచం ఇవ్వకపోతే
ఇంచుక పనులైన జరుగవేయని పిటిషన్
తంచనుగా వ్రాసిస్తే
చించవతల విసరగలరు సిరిసిరిమువ్వా

తారాపథ మెక్కాలని
కోరికతో చేరుచుందు కోమలు లెల్లన్
జారుడు మెట్లను తొక్కుచు
చేరుదురోయ్ బ్రోతలాను సిరిసిరిమువ్వా

అత్తాకోడళ్ళ నడుమ
పొత్తుండాలంటు ఎంత బోధించిన నీ
కుత్తుక తెగునే వారల
చిత్తంలో మార్పురాదు సిరిసిరిమువ్వా

ఇద్దరు లేక ముగ్గురు
ముద్దను స్లోగన్నుచూసి ముచ్చపడితే
ఇద్దరు ముగ్గురు ట్రిప్పుకు
సిద్ధం అయితే గతేమి సిరిసిరిమువ్వా

గుప్పున పొగ పీలుస్తూ
కప్పుడు టీ లాగి నీదు కవితలలోనే
తప్పులు పట్టకపోతే
చెప్పచ్చుకు కొట్టవోయి సిరిసిరిమువ్వా

కులమత తత్వాలొద్దని
పలురీతుల పలవరించు ప్రభుతయె మళ్ళీ
కులమత శక్తుల దువ్వుచు
సెలవేసిన పుండగికు సిరిసిరిమువ్వా

బానిస వ్యాపారాలను
మానేస్తే మానవచ్చు, మన దేశంలో
బానిసలకు కొదువేమిటి?
చేనగిలిన భార్యలుండ సిరిసిరిమువ్వా

ఎప్పుడో జరిగిన వన్నీ
ఇప్పుడు బోధించుతుంటె ఏమిటిలాభం?
ఇప్పుడు ఎట్లా బ్రతుకుటొ
చెప్పరుకద స్కూళ్ళలోన సిరిసిరిమువ్వా

ఉపాధ్యాయులు: గౌరీశంకరరావు M.A

ఎండనకా వాననకా
కండలు కరిగించు రైతు కష్టందోచే
ముండ దళారుల నెప్పుడు
చెండాడే వేళ వచ్చు సిరిసిరిమువ్వా

లోకాలను లేపేస్తూ
బాకాలో ఉదయగీతి పాడేస్తుంటే
వేకువ వేగిర పెడితే
చీకటి ఇంకెక్కడుంది సిరిసిరిమువ్వా

పద్యం వ్రాయుట కష్టం
గద్యంలో వ్రాయుటన్న కష్టమె రెండూ
హృద్యం చేయాలంటే
సేద్యంలా కష్టమయ్య సిరిసిరి మువ్వా.